నేటి దినపత్రిక
సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం | 25 నవంబర్ 2024 | పేజీలు 8

# ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దు

## జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఫీజులు సకాలంలో చెల్లించ లేదని స్టూడెంట్స్‌ను వేధించ వద్దని జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలను హెచ్చరించారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్మెంట్ చేయ లేదనే కారణంతో క్లాసులకు రానివ్వకపోవడం, ప్రాక్టికల్స్‌కు హాజరు కానివ్వక పోవడం, పాస్ సర్టిఫికెట్లు జారీ చేయకపోవడం వంటి అంశాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థినీ విద్యార్థులను వేధింపులకు గురిచేస్తే కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కాలేజీలకు విడుదల చేస్తామని, పాత బకాయిలు కూడా క్రమంగా విడుదల చేస్తామని, ప్రభుత్వం ఇప్పటికే -మిగతా 2లో



# వెంకయ్యనాయుడును కలిసిన సన్నపురెడ్డి



*నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :*

నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ఆదివారం మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయు డును చెనై రాజ్‌భవన్‌లో మర్యా ద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేశారు.

# మా కొద్దు.. లక్కీ వైన్స్‌షాప్

- 20వ రోజుకు చేరుకున్న ఆందోళన
- అధికారులారా సమస్యను పట్టించుకోండి
- ఆందోళనకారులు వేడుకోలు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగరంలోని వాకర్స్ రోడ్‌లోని పరమేశ్వరి నగర్ దగ్గర ఉన్న లక్కీ వైన్‌షాప్‌ను తొలగించాలని చేపట్టిన ఆందోళన ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. గత కొన్ని రోజుల నుంచి స్థానికంగా ఉన్న ప్రజలు, వివిధ సంఘాలకు సంబంధించిన నాయకులు, మహిళలు రోజుకొక రీతిలో వినూత్నమైన నిరసన తెలుపుతున్నా.. అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ స్పందించకపోవడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకొద్దు మహా ప్రభువు.. అంటూ, వైన్‌షాప్ తొలగించాలని ప్రజలు కోరినా, ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఏకంగా స్థానికంగా ఉన్న మహిళలే రంగంలోకి దిగి ధర్నా శిబిరంలో కూర్చుంటున్నారు. అయితే ప్రభుత్వానికి లక్షల రూపాయలను బ్రాందీషాపు కోసం చెల్లించారని, ఇలాంటి తరుణంలో మా వల్ల కాదని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఏమైనా ఉంటే ఆందోళనకారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. బ్రాందీషాపును తొలగించాలని ఆందోళనకారులు ఇప్పటికే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను పలు మార్లు కలిశారు. దీంతో అధికారులు, ప్రజా ప్రతినిధుల నుండి ఆందోళన కారులకు ఎటువంటి -మిగతా 2లో

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను
# సద్వినియోగం చేసుకోండి

## కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీ కోసం.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమిషనర్ సూర్య తేజ ఆకాంక్షించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్ర మంలో ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాలయంలో కమీషనర్‌ను కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందుకున్న సమస్యలను వీలున్నంత త్వరగా పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని కృషి చేస్తామని కమీషనర్ తెలిపారు.

## వైఎస్ జగన్‌పై
# ధ్వజమెత్తిన ఆనం



ఆనం వెంకట రమణారెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ సీనియర్ నేత, ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అవినీతిలో జగన్మోహన్ రెడ్డి అంతర్జాతీయంగా ఎదిగిపోయాడని విమర్శించారు. గౌతమ్ అథానీని జగన్ మూడుసార్లు కలిశారని, రహస్యంగా ఎందుకు కలిశారని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కూడా అనేక మందిని కలిశారని, అధికారికంగా కలిసి మీడియాకు సమాచారం ఇచ్చారని, జగన్ ఎందుకు రహస్యంగా కలిసి వచ్చారో, వీరి గురించి గురించి అందరికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. తాను అవినీతి చేయలేదని జగన్ అంటున్నాడు.. తప్పు చేయకపోతే న్యాయవాది పొన్నవోలును అమెరికాకు ఎందుకు పంపాడని ప్రశ్నించారు. రూ.1750 కోట్ల లంచం తీసుకున్నావని ఎఫ్‌బీఐ చెబుతోందన్నారు. ఆ డబ్బులు ఎక్కడ ఉన్నాయి జగన్ అంటూ ప్రశ్నించారు. సోలార్ పవర్‌ని 11 రూపాయలకి కూడా కొన్నారన్నారు. 9 వేల మెగావాట్లకి 1750 కోట్లు సరే.. ఇంకా అనేక సోలార్ సంస్థలకు పీపీఏలు చేశారని, వాళ్ళ దగ్గర ఎంత లంచం తీసుకున్నారో బయటకి తీయాలన్నారు. 20 వేల కోట్ల రూపాయల లంచం సోలార్ పవర్‌లో -మిగతా 2లో

## ప్రతి గిరిజన విద్యార్థి..
# విద్యే ఆయుధంగా ముందుకు సాగాలి



## మేయర్ స్రవంతి జయవర్ధన్

ప్రతి గిరిజన విద్యార్థి, విద్యే ఆయుధంగా ముందుకు సాగాలని మేయర్ స్రవంతి జయర్ధన్ కోరారు. గుర్రం బాబయ్య కల్యాణమండపంలో నిర్వహించిన బిర్సాముండా వ్యాసరచన పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా నలుమూలల నుండి విశేష స్పందన లభించింది. 2లో

# నేడు కార్తీక చివరి సోమవారం



లోపల పేజీలో

# అధికారులకు వార్డుల కేటాయింపు ప్రక్రియ పూర్తి



కమిషనర్ సూర్యతేజ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ అంతర్గత బదిలీలలో భాగంగా ఆరోగ్య శాఖ విభాగం ఇంచార్జ్ శానిటరీ సూపర్వైజర్లుగా బదిలీ అయిన ఇద్దరు రెవెన్యూ అధికారులు ఎస్‌ఏ.సమద్, వి.రాజేశ్వరిలకు వార్డులను కేటాయిస్తూ కమిషనర్ సూర్యతేజ ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. ఉత్తర్వుల మేరకు శానిటరీ సూపర్వైజర్‌గా ఉన్న డి.వెంకటేశ్వర్లుకు 23 నుంచి 33 వరకు, శానిటరీ సూపర్వైజర్ ఇన్చార్జిగా ఉన్న వి.నరసింహారావుకు 12 నుంచి 22 వరకు, శానిటరీ సూపర్వైజర్ ఇన్చార్జిగా ఉన్న కే.వెంకటశేషయ్యకు 34 నుంచి 44 వరకు, ఎస్‌ఏ.సమద్‌కు 45 నుంచి 54 వరకు, వి.రాజేశ్వరికి ఒకటి నుంచి 11 వరకు వార్డులను కేటాయించారు. శానిటరీ సూపర్వైజర్ ఇన్చార్జిగా ఉన్న ఎస్.సురేంద్రనాద్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా వీరితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నుంచి ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా బదిలీ అయిన సిహెచ్. కృష్ణంరాజుకు 21 నుంచి 24 వరకు, కె.కృపాకర్ రావుకు 13 నుంచి 16 వరకు, ఐ.చిన్న బాబుకు 25 నుంచి 28 వరకు వార్డులను కేటాయించారు. హెల్త్ అసిస్టెంట్ల నుంచి ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా బదిలీ అయిన ఎస్.శ్రీనివాసులుకు 51 నుంచి 54 వరకు, వై.శ్రీనివాసులుకు 5 నుంచి 8 వరకు, పి.ఆశీర్వాదంకు 33 నుంచి 35 వరకు వార్డులను కేటాయించారు. ముగ్గురు శానిటరీ సెక్రటరీలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా బదిలీ చేశారు. వారిలో డి.ప్రవల్లికకు 37 నుంచి 40 వరకు, వి.అశోక్‌కు 46 నుంచి 50 వరకు, డి.ప్రశాంతికి 17 నుంచి 20 వరకు వార్డులను కేటాయించారు. పరిపాలన సౌలభ్యం కోసం జరిగిన బదిలీ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన వార్డులను, విధులను స్వీకరించి బాధ్యతగా కర్తవ్యాలను నెరవేర్చాలని కమిషనర్ ఆకాంక్షించారు.


# ప్రతి గిరిజన విద్యార్థి.. విద్యే ఆయుధంగా ముందుకు సాగాలి

### మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు అయ్యప్ప గుడి దగ్గర ఉన్న గుర్రం బాబయ్య కళ్యాణమండపంలో నిర్వహించిన బిర్సాముండా వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా నలుమూలల నుండి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా నెల్లూరు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్, ఉలవపాడు జెడ్పీటీసీ చేవూరు అరుణ, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ.. ప్రతి గిరిజన విద్యార్థి, విద్యే ఆయుధంగా ముందుకు సాగాలని కోరారు. గిరిపుత్ర ఫౌండేషన్ వారు బిర్సాముండా జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. బ్రిటీషర్లతో స్వాతంత్ర్యం కోసం పోరాడి గిరిజనులకు పోరాట పటిమను చాటి చెప్పిన వ్యక్తి బిర్సాముండా అని తెలిపారు. అదే విధంగా బ్రిటీషర్ల చేతిలో జైలులో విష ప్రయోగానికి గురై వీర మరణం పొందిన మహనీయులు బిర్సాముండా అని ఈ సందర్భంగా తెలియజేశారు. అంతేకాకుండా గిరిజన విద్యార్థులలో ఈ వ్యాసరచన పోటీలు పోటీతత్వాన్ని పెంపొందించి వారి వ్యక్తిత్వ వికాసాన్ని ప్రోత్సహించడం చాలా సంతోషమని, గిరిపుత్ర ఫౌండేషన్ వారికి తన అభినందనలు తెలియజేశారు. అనంతరం గిరిపుత్ర ఫౌండేషన్ నిర్వాహకులు చేవూరు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ వ్యాస రచన పోటీలకు జిల్లా నలుమూలల నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన టీచర్స్‌కి, తల్లితండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు కార్తీక చివరి సోమవారం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం నాలగవ, చివరి సోమవారం. శివుడిని హృదయపూర్వకంగా స్మరించినట్లయితే, జీవితంలోని అన్ని కష్టాలు తొలగిపోతాయని పురాణాలలో చెప్పబడింది. హిందూ మతంలో శివుడు చాలా దయగలవాడు. శివుడు ఒక్క కుండ నీటితో కూడా సంతోషిస్తాడని చెబుతారు. సోమవారం శివుని ఆరాధనకు చాలా ప్రత్యేకమైన రోజు. హిందూ మతంలో సోమవారాన్ని చాలా పవిత్రం, ప్రత్యేకంగా భావిస్తారు. కార్తీక మాసంలో చివరి సోమవారం చాలా ముఖ్యమైందిగా పరిగణించబడుతుంది. ఈ రోజున శివుడిని హృదయ పూర్వకంగా ఆరాధించడం, కొన్ని చర్యలు చేయడం వల్ల జీవితంలో ఆనందం, శ్రేయస్సు లభిస్తుంది. కార్తీక మాసం చివరి సోమవారం కనుక భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పరమేశ్వరుడిని బిల్వదళాలతో పూజించాలి. భక్తులు ఉపవాసంతో స్వామి వారిని పూజించి దీపారాధన చేయటం వల్ల ఆ పరమేశ్వరుడు అనుగ్రహం కలిగి శుభ ఫలితాలు కలుగుతాయి. పంచామృతంతో శివునికి అభిషేకం చేయడం చాలా పవిత్రమైంది. శివ లింగానికి అభిషేకం చేసిన తర్వాత, చందనం, బిల్వపత్రం, ధాతుర, శమీ పత్రాలను సమర్పించడం వల్ల శివుడు దీంతో సంతోషిస్తాడు. శివునికి రుద్రాభిషేకం చేయడం ఒక వ్యక్తి జీవితంలోని సమస్యలను తొలగించడానికి ఉత్తమ పరిష్కారం. సోమవారం శివునికి నెయ్యితో అభిషేకం చేస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. శివునికి గంగా జలంతో అభిషేకం చేస్తే సర్వ దుఃఖాలు, పాపాలు నశిస్తాయి. చెరుకు రసంతో అభిషేకం చేయడం వల్ల భక్తులు ఆర్థిక సమస్యల నుంచి ఉపశమనం పొందుతారు. శివునికి దీపదానం చేయండి. దీంతో ఆ వ్యక్తి కోరికలన్నీ నెరవేరుతాయి. ఉదయం సాయంత్రం నది స్నానాలను ఆచరించి పూజ చేయాలి. మనసు మొత్తం ఆ పరమేశ్వరుడుపై నుంచి మూడుసార్లు నదీ స్నానం చేసిన అనంతరం స్వామివారికి పూజ చేయాలి. గుడిలో కూర్చుని కనీసం 108 సార్లు ఓం నమః శివాయ అని జపించండి. శివాలయంలో రుద్రాక్షను సమర్పించడం వల్ల వైవాహిక జీవితం సంతోషంగా ఉంటుంది. సోమవారం తెల్లని దుస్తులు ధరించడం, చందనం తిలకం వేయడం కూడా విశేషం. ఉపవాసంతో స్వామి వారిని పూజించిన తర్వాత చాలా మంది భక్తులు కార్తీక వన భోజనాలు చేస్తారు. ఇక కార్తీక భోజనాలలో భాగంగా ఉసిరి చెట్టుకు పూజలు చేసిన అనంతరం ఆ చెట్టు కిందే భోజనం చేస్తారు.

## ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించినందున పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులను ఫీజుల విషయమై వేధించరాదని కలెక్టర్ కోరారు. ఈ మేరకు కళాశాలల ప్రిన్సిపల్స్‌తో విద్యా శాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయమై విద్యార్థులను తరగతులకు హాజరు కానివ్వడం లేదని, లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానివ్వలేదని, పాస్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని జిల్లాలో ఎక్కడైనా ఫిర్యాదు అందితే, సదరు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపామని కలెక్టర్ ఆనంద్ చెప్పారు.

## వైఎస్ జగన్‌పై ధ్వజమెత్తిన ఆనం

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌కి ముట్టిందని ఆరోపించారు. టీటీడీకి అన్యాయం చేశాడని, అందుకే ఆ స్వామి అమెరికాలో కేసు పెట్టించాడన్నారు. ఇక్కడ చట్టాలు మాదిరిగా ఉండదని, 6 నెలల్లో తీర్పు వస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కేసులకు 11 ఏళ్లయిందని, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చొరవ తీసుకుని కేసుల వ్యవహారంలో వేగం పెంచాలన్నారు.

## మా కొద్దు.. లక్కీ వైన్స్‌షాప్


(మొదటి పేజీ తరువాయి)



సానుకూలమైన స్పందన కనపడకపోవడంతో రోజురోజుకు ఈ ప్రాంతంలో నిరసనకారులు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. గత మూడు రోజుల క్రితం ఫుల్‌గా తాగి బండి మీద నుంచి ఓ వ్యక్తి పడిపోయారని, ప్రజలకు అందించడానికి మంచినీళ్ల గతి లేదు కానీ, ప్రభుత్వాలు మద్యం మాత్రం నాణ్యమైందిగా.. బాగా కిక్ ఇచ్చేదిగా అమ్ముతున్నట్టున్నారని అనడంతో అక్కడ నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు ఒక్కసారిగా నివ్వెరపోయారు. అయితే అధికారులు మాత్రం కొన్ని రోజుల నుంచి నిరసనకారులు ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో స్థానికంగా ఉన్న ప్రజలకు కానీ, ఆందోళనకారులకు కానీ అర్థం కావడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాలు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు శీనయ్య, అడ్వకేట్ అంబేద్కర్, అడ్వకేట్ శివశంకర్, జాషువా, బాలకృష్ణ, పాటల శీనయ్య, జుబేర్, అబ్దుల్ ఘని కిర్మని, సయ్యద్ సర్దార్, నవీద్, అరవ రాయప్ప, జిలాని, అబ్దుల్ రెహమాన్.. మహిళలు పాల్గొన్నారు.

## యాదవులు అన్ని రంగాలలో ముందుండాలి

### మాజీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా యాదవ కులస్తులు మరింత ఎదగాలని మాజీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు పట్టణంలోని యాదవ భవన్‌లో కార్తీకమాసం సందర్భంగా యాదవుల కార్తీక వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులు అభ్యున్నతికి తాము ఇప్పుడు కట్టుబడి ఉన్నామని చెప్పారు, వారికి విద్యా వైద్య విషయంలో ఎల్లప్పుడూ అండగా ఉండాలని తెలిపారు. తప్పకుండా సంస్థల్లో 4500 మంది ఉద్యోగులు ఉన్నారని వారి కుటుంబాలకు నేను తోడుగా ఉన్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, భరత్ కుమార్ యాదవ్, బొమ్మి నాగ కిషోర్, హరిబాబు యాదవ్, దేవరాల సుబ్రహ్మణ్యం, నాగేంద్ర యాదవ్, అన్నంగి రమణయ్య పద్మజా యాదవ్‌తోపాటు యాదవ నాయకులు పాల్గొన్నారు.

# ప్రాచీనసాంప్రదాయాలను ప్రతిబింబింపజేసేవి జానపదకళలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రాచీన సంప్రదాయాలను ప్రతిబింబింపజేసేవి జానపదకళలని తెలుగుభారతిసేవాసమితి ప్రతినిధి, మంచిమాట కార్యక్రమ ప్రధాన వక్త కొల్లా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులోని తెలుగు భారతిసేవా సమితి ఆధ్వర్యంలో మంచిమాట అనే పేరుతో ఒక్కో అంశాన్ని ప్రాధాన్యతగా ఒక్కో వక్త ప్రసంగించేలా కార్యక్రమం నిర్వహిస్తుండడం తెల్సిందే. కాగా ఈ ఆదివారం స్థానిక గ్రంథాలయ ఆవరణలోని తెలుగుభారతి సేవాసమితి సమావేశ మందిరంలో జానపదకళలు అనే అంశంపై మంచిమాట కార్యక్రమం నిర్వహించగా ప్రధానవక్త కొల్లా వెంకటేశ్వర్లు తన ప్రసంగం ద్వారా వివరించారు. జానపదకళలు అనేవి ప్రజల యొక్క, ప్రాచీనసంస్కృతి, సాంప్రదాయాల విలువల ప్రతినిధ్యం వహించే కళలని, ఇవి ప్రదానంగా గ్రామీణ జీవనవిధానానికి సంబంధించినవని, ఒక తరం నుండి మరో తరానికి సంక్రమించబడతాయన్నారు. జానపదకళల ముఖ్య లక్షణాలు గురించి, జానపదకళలు సామాన్య ప్రజల జీవన పరిస్థితులను, ఆచారాలను, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. జానపదకళలు ఎలాంటి ఆర్భాటం లేకుండా సహజంగా ప్రజల దైనందిన జీవితంలో భాగమవుతాయని వెంకటేశ్వర్లు వివరించారు. గ్రామీణ ప్రజలు తమ జాతీయపండుగలు, వివాహాలు, పంటకోతల సందర్భంగా కళలను ప్రదర్శిస్తారన్నారు. జానపదపాటలు, నృత్యాలు, ముఖ్యబాగాలన్నారు. లంబాడి, బుర్రకథ, ఒగ్గుకథ గురించి, ప్రతి జానపదకళకు ప్రత్యేకమైన వస్త్రధారణ, అంలకరణ ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ జీవితానికి అనుగుణంగా జన్మించిన పాటల గురించి సాంస్కృతిక వారసత్వమని, జానపదకళలు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో కీలకమని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రజలమధ్య ఐక్యత పెంపొందిస్తాయని, ప్రజలకు వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందిస్తాయని, వాటి పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని, ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు ఈ కళలను అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు అంకినపల్లి గోవింద రెడ్డి, గౌరవసలమాదారులు ఎస్.వి.రమణయ్య, ఎస్.యానాదిరెడ్డి, కె.వి.శేషారెడ్డి, వి.నారాయణ రావు, సహప్రధానకార్యదర్శి జి.రామిరెడ్డి, ఉపాధ్యక్షులు టి.సి.వి.సుబ్బయ్య, ఓంకారం శ్రీనివాసరాజు, రాఘవేంద్రరావు, పెంచలరెడ్డి, ప్రచారకార్యదర్శి కలిశెట్టి రవీంద్రకుమార్, సమితి ప్రతినిధులు వెంకటకృష్ణయ్య, గంజి పెంచలయ్య, సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకయ్య, బండారు వెంకటేశ్వర్లు, అపర్ణా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




# బుచ్చి-ముంబై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల గ్రామ సమీపంలోని ముంబై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆత్మకూరు మండలం మంచాల పల్లి గ్రామానికి చెందిన జాజి కర్త మస్తానయ్య కుమారుడు జాజి కర్త రాజ్ కుమార్ (25) బైక్ పై నెల్లూరు వైపు వెళ్తుండగా రేబాల సెంటర్ వద్ద నెల్లూరు నుండి బుచ్చివైపు వస్తున్న బొగ్గు లారీ ఢీకొనడంతో రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. బొగ్గు లారీ డ్రైవర్ సమీపంలోని పెట్రోల్ బంకులో లారీ ఉంచి డ్రైవర్ పరార్ అయినట్టు సమాచారం విషయం తెలుసుకున్న బుచ్చి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఆనం కృషితో పోలేరమ్మ గుడికి సీసీ రోడ్డు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి పోలేరమ్మ గుడికి వెళ్లేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ తరుణంలో ఆదివారం గ్రామానికి చెందిన బిజివేముల సురేంద్రనాథ్ రెడ్డి, రాజాల రామకృష్ణారెడ్డి, వివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పనులు ప్రారంభ మయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా గుడికి వెళ్లేందుకు దారి కూడా లేకపోవడంతో గ్రామస్తులు నానా అవస్థలు ఎదుర్కొన్న పరిస్థితుల్లో ఆనం ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారని వారు తెలిపారు. దీంతో ఆనంకు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. ఇలాంటి మరెన్నో అభివృద్ధి పనులు చేపడతారని గ్రామస్తులు ఆశిస్తున్నారు.

# అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్రంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వంలు ఐసిడిఎస్ పరిస్థితిని గమనించి బలోపేతం చేయాలని, అంగన్‌వాడీ కార్యరక్తలు, సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా మండల నాయకులు జి.శివప్రసాద్, ఏ.నాగయ్య, సిపిఎం పట్టణ ప్రధానకార్యదర్వి కె.డేవిడ్‌రాజు, అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్ట్‌కమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ తదితరులు డిమాండ్ చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం సుప్రీమ్‌కోర్టు ఇచ్చిన గ్రాట్యుటిఅమలు తీర్పును ప్రక్కనపెట్టారన్నారు. కోర్కెల సాధనకు 42రోజులపాటు సమ్మె నిరవధికంగా చేశామని, అయితే నాడు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని వారు పేర్కొన్నారు. గత 10సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. దేశవ్యాపితంగా అంగన్‌వాడీలకు మొబైల్‌ఫోన్లు ఇవ్వకుండా పోషణ్‌ట్రాక్ యాప్‌ను తెచ్చి ఆధార్‌ను లింక్‌చేసి లబ్దిదారుల లిస్టును తగ్గించిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయనందునే 42రోజులు నిరవధికసమ్మె చేయాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీమ్‌కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి అమలు చేయాలని, ఐఎల్‌సి శిపార్సుల ప్రకారం కనీసవేతనాలు 26వేల రూపాయలు, పెన్షన్, పి.ఎఫ్, ఇఎస్‌ఐలను అమలుచేయాలని, మినీవర్కర్లను మెయిన్‌వర్కర్లుగా గుర్తించాలని, ఆ సెంటర్లకు హెల్పర్లను నియమించాలని, 42రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం మినిట్స్‌కాపీలో అంగీకరించిన అంశాలను జివోలుగా ఇవ్వాలని, అంగన్‌వాడీ ప్రీస్కూల్స్‌ను బలోపేతం చేయాలని, 5సంవత్సరాలలోపు పిల్లలు ప్రవేటు కాన్వెంట్లకు వెళ్ళకుండా జివో ఇవ్వాలని, 4లేబర్‌కోడ్‌లు రద్దుచేయాలని, ఐసిడిఎస్ ప్రవేటీకరణ, ప్రభుత్వసంస్థల ప్రవేటీకరణ ఆపాలని, ఎన్నికలనంతరం కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలను బలవంతంగా రాజీనామాలు చేయించడం, సెంటర్లకు తాళాలు వేయడం, రాజకీయవేధింపులకు పాల్పడడం ఆపాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రధానోపాధ్యాయుల కోర్కెలను ప్రభుత్వం ఆమోదించాలి : జిల్లా అధ్యక్షుడు సోమవరపు


**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని నెల్లూరు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సోమవరపు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం నెల్లూరు జిల్లా మహాసభలను నెల్లూరులోని వైవిలయన్స్ భవన్ మీటింగ్ హాల్‌లో నిర్వహించామని ఆత్మకూరుకు చెందిన జిల్లా అధ్యక్షుడు భాస్కరరెడ్డి తెలిపారు. సోమవరపు భాస్కరరెడ్డి అధ్యక్షతన ఈ మహాసభలు నిర్వహించారు. జిల్లా ప్రధానకార్యదర్శి జి.శ్రీనివాసరావు, కోశాధికారి చలపతి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ప్రదానోపాధ్యాయులు పాల్గొన్నారు. వివిద జిల్లాల నుండి రాష్ట్ర కార్యవర్గసభ్యులు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.వి.నారాయణరెడ్డి, అధ్యక్షుడు పి.వి.రమణ, ప్రధానకార్యదర్శి వి.శ్రీనివాసరావు, కోశాధికారి సివివి స్వతనారాయణలు పాల్గొన్నారు. ఈసమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా కామన్‌రూల్స్ అమలు పరచాలంటూ తీర్మానం చేశారు. ఈ కోర్కె సాధనకోసం అన్నిరకాలుగా న్యాయ, ప్రత్యక్ష పోరాటాలు చేసి సాధించుకుంటామన్నారు. ప్రధానోపాధ్యాయుల విధినిర్వహణలో యాప్‌ల ప్రభావం అధికంగా ఉందన్నారు. ఏపీఏఏఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని, రాష్ట్ర ఉన్నతాధికారుల వత్తిడి మానుకోవాలని వారు కోరుతూ ఈమేరకు తీర్మానం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 1998లో జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయులకు న్యాయం చేసి ఉపవిద్యాశాఖాధికారి, డైట్ సీనియర్ లెక్చరర్ తదితర పదోన్నతులు ఖచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపాఠశాలలో బోధనేతర సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్‌లు ఉండేవిధంగా విద్యాశాఖామంత్రి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపిఏఏఆర్, పదవతరగతి రోల్స్ అని ముమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంలో ప్రదానోపాధ్యాయులను రెసిడెన్షియల్ శిక్షణాతరగతుల పేరిట వారం రోజులపాటు పాఠశాలకు దూరం చేయడం శోచనీయమని వారు పేర్కొన్నారు. నామినల్‌రోల్స్ ఫైనల్ సబ్మిషన్ తేదీని విస్తరించాలని కూడా వారు కోరారు. జిల్లా వ్యాప్తంగా 300మంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.






# ఘనంగా దేవాంగ సంక్షేమ సంఘం కార్తీక వనభోజనం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండపై వెలసి ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాంగణంలో నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తొలుత దేవాంగ కులదైవం శ్రీ చాముండేశ్వరి దేవిలకు, వేదగిరి లక్ష్మీనరసింహ స్వామిల వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి తర్వాత శివ లింగానికి అభిషేకమనరించారు. తరువాత ఉసిరి చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, సంఘ ఆవిర్భావ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా డాక్టర్ మన్నెం సతీష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సర కాలంలో అనేక పథకాలు పేద దేవాంగుల కొరకు ప్రవేశపెట్టామని, రాబోవు రోజుల్లో మరి కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య అతిదులను అందర్నీ ఆహ్వానించారు. సంవత్సరం కాలం పాటు నిర్వహించిన కార్యక్రమాలను నివేదిక సమర్పించారు. అనంతరం అసోసియేట్ అధ్యక్షులు సజ్జ వెంకట సురేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కోశాధికారి కొండా మాధవయ్య, సంఘ వార్షిక నివేదిక అందించారు. విద్యా కానుక పథకము ద్వారా సుమారు 12 మంది పేదదేవాంగ విద్యార్థులకు పదివేల రూపాయలు స్కాలర్షిప్ అందజేశారు. మహిళలకు పిల్లలకు ఆటల పాటల పోటీలు డాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్తీక వనభోజనం మహెూత్సవానికి దేవాంగజనులు సుమారు 5వేలమంది దేవాంగ కుటుంబాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. మమ్మల్ని 3 సార్లు గెలిపించిన మా నియోజకవర్గ ప్రజలలో ఎక్కువ మంది చేనేతలే వున్నారు. వారికి మేము ఎప్పటికీ రుణ పడివుంటామన్నారు. సంఘ వారు కోరిన విధంగా రూరల్ నియోజకవర్గంలో సిటీకి దగ్గరగా ఎక్కడైనా స్థలం చూసి దాన్ని కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తప్పక సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మరొక అతిథి సజ్జ హేమలత ఆప్కో చైర్మన్‌గా భాధ్యతలు స్వీకరించిన తదుపరి చేనేతల సమస్యలను ప్రభత్వం దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత తోడ్పాటు అందిస్తానన్నారు. దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ.. సంఘ సభ్యుల మధ్య ఐకృత మరింత పెంచి సమాజంలో గుర్తింపు వచ్చేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకుడు పముజుల దశరథ రామయ్య, చందన బ్రదర్స్ సీఎంఆర్ అధినేత మా ఊరి శ్రీనివాసరావు, హెచ్ఆర్ కళ్యాణ మండపం అధినేత కన్నా రాఘవరావు, పన్నెం శ్రీనివాసులు, చేనేత సంఘం కార్యదర్శి పముజుల హరి తదితరులు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి సేవకులు, సొసైటీ అధ్యక్షులు వెంకట సూర్య



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని బుజబుజ నెల్లూరు నందు అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అన్న లక్ష్యంతో పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ సేవ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా నేటి బాలలే రేపటి సేవకులు అన్న నినాదంతో బుజబుజ నెల్లూరు శివారు ప్రాంతంలో ఉన్న వృద్ధుల ఆశ్రమం నందు చిన్నారులచే విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారూ అనంతరం అవ్వతాతలతో పిల్లలు సందడి చేసి తమకు మేము ఉన్నామని భరోసా కల్పించారు. పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ రాబోవు రోజుల్లో పిల్లలకు చిన్ననాటి నుంచి సేవ ఆలోచనలు కలిగేలా ప్రోగ్రాం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంస్థ వ్యవస్థాపకులు కోగిలి రమేష్ రాజు, అధ్యక్షులు ముని వెంకట సూర్య, వైస్ ప్రెసిడెంట్ కాళహస్తి సుధాకర్, వంశీ రాజు, సుశ్రీత, ప్రీతి, సుశాంక్ రాజ్, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# అల్ట్రా మెగా ప్రాజెక్ట్ భూములు రైతులకు ఇవ్వండి

## కృష్ణపట్నం గ్రామస్తులు డిమాండ్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలోని సూపర్ క్రిటికల్ అల్ట్రా మెగా ప్రాజెక్ట్ భూములను వెంటనే ప్రభుత్వం రైతులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కృష్ణపట్నం గ్రామస్తులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం బస్టాండ్ సెంటర్ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు చేసిన తప్పిదాల వల్ల నిధులు దుర్వినియోగం అయినట్లు పేర్కొన్నారు. థర్మల్ కేంద్రానికి తీసుకున్న భూములను ప్రాజెక్ట్ యాజమాన్యం నిరుపయోగంగా ఉంచడం వల్ల రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. పరిశ్రమల అధికారులు గ్రామానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి జీవన భృతి కల్పించాలని కోరారు. సర్వే నెంబర్ 756లో జరిగిన భూ కుంభకోణం పై అధికారులు విచారణ చేసి పేదలకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సమావేశంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గ్రామంలో ఘనంగా సిద్ధేశ్వర స్వామి ఊరేగింపు

**సైదాపూరం, మేజర్‌న్యూస్ :** సైదాపురంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ సిద్దేశ్వరస్వామి 4వ కార్తిక సోమవారం కావడంతో కోనలో భక్తులు పోటెత్తారు. స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామిని సిద్దేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు డేగ రమణయ్య తెలియజేశారు. భక్తుల కొరకు కమిటీ మెంబర్లు, వలంటీర్లు, పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అన్నదానం కార్య క్రమం ఏర్పాటు చేశామన్నారు. సోమవారం సాయంత్రం శ్రీ సిద్దేశ్వర స్వామి గ్రామ మహెూత్సవాన్ని సైదాపురం నందు ఘనంగా ఊరేగింపుతో శ్రీ సిద్దేశ్వర స్వామి వస్తారని భక్తులు సహకరించేలా ఉండాలని ఆలయ కమిటీ తెలిపారు.

## అనూషను అభినందించిన బీజేపీ నేతలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలపేటలో బీజేపీ కుటుంబం కళ్ళు భాస్కర్- సరస్వతిల పుత్రిక చిరంజీవి అనూషను అభినందించారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో విక్రమ సింహపురి యూనివర్సిటీ టాపర్గా వచ్చినందుకు అనూషను బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ మూలపేట బీజేపీ మండల అధ్యక్షులు అల్లూరు నాగేంద్ర సింగ్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇది చరిత్రాత్మక ఘన విజయం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బీజేపీ కేంద్ర కార్యాలయంలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన సందర్భంగా బీజేపీ కార్యకర్తలు అభిమానులు నాయకులు స్వీట్లు పంచుకొని టపాకాయలు కాల్చారు. అనంతరం మీడియాతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఇది చరిత్రాత్మక విజయం అని ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతౌల్యం సాధించాంమని, ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేయ కుండా, అభివృద్ధే లక్ష్యంగా మోడి పాలన కొనసాగుతుందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో మహారాష్ట్ర దూసుకుపోతుందని, దేశం మొత్తం కాషా యమయం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యరబోలు రాజేష్, గడ్డం విజయ్‌కుమార్, కరణం సుభాషిని, గిరి కుమార్ గౌడ్, మదన్, సుబ్బారావు, అయినకోట రఘు రామయ్య, ముని సురేష్, పిడుగు లోకేష్, కుప్పా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అచ్చమాంబ పొంగళ్ళు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పొంగూరు మాలిచేలో వెలసిన అచ్చమాంబ ఆలయం వద్ద ఆదివారం భక్తులు ఘనంగా పొంగళ్ళు పొంగించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసాలు ఉండి పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నెలకొన్న ఈ ఆలయం వద్దకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఆలయం వద్దకు వచ్చినటువంటి భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.



# అయ్యప్ప గుడిలో మండల పూజలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** స్థానిక వేదయపాలెంలో వేంచేసియున్న వేద శాస్త్ర స్వామి అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి వారికి కేరళ సాంప్రదాయ కార్తీకమాస మండల పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండల పూజలలో భాగంగా ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హెూమం, ఉష పూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం మహాదీపారాధన, భగవతి సేవా, అత్తాళ్ళ పూజ, శ్రీ వేలీ ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం, కార్యక్రమాలు కేరళ తంత్రులచే ఘనంగా జరిగాయి. మండల పూజల ఉభయ కర్తలుగా పల్లంరెడ్డి విజయకుమార్ రెడ్డి వసంతమ్మ దంపతులు, పల్లం రెడ్డి హర్షారెడ్డి సంధ్యా దంపతులు, వేలూరు హరినాథ రెడ్డి గిరిజమ్మ దంపతులు, శివ సునీల్ రెడ్డి సుధా దంపతులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉభయకర్తలుగా పుత్తూరు తులసిరాజు సుజాతమ్మ దంపతులు, గణేష్ సంధ్య దంపతులు, భరత్ హేమా దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, పలువురు అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు.

# మర్రిపాడులో యుటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండల యుటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు మండల కేంద్రంలోని యుటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా యుటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గతంలో యుటీఎఫ్‌లో వివిధ బాధ్యతలలో పనిచేసి పదవీ విరమణ పొందిన పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు వి.మాల కొండయ్య, కే.మస్తానయ్య, కే.వి.రమణయ్య, పి.రామయ్య, కె.అరుణమ్మ, జీ.సుబ్బరాయుడు, పి.వెంకట సుబ్బయ్య, పి.సత్యం, ఎస్.చలమరాజు, బి.అనంతరామయ్య, వై.గంగాధర్, జీ.తిరుపతి, ఎం.వెంకటసుబ్బయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. యుటీఎఫ్ సంఘం సామాజిక స్పృహ, సామాజిక బాధ్యతతో విద్యాభివృద్ధికి పాటుపడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నదని అన్నారు.అనంతరం నూతన మండల శాఖను ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా పి.విజయ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కె.సుధాకర్, కోశాధికారిగా ఎస్.వెంకటయ్య, మహిళా కార్యదర్శిగా టి.అనుషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి హెచ్.మోహన్ ప్రసాద్, పరిశీలకునిగా జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ డైరెక్టర్ షేక్ నాయబ్ వ్యవహరించారు. సీనియర్ నాయకుడు జీ.సుబ్బారాయుడు ఆధ్వర్యంలో విచ్చేసిన అతిథులందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యుటీఎఫ్, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జయహెూ జనసేనాని..



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** సామాన్యుడు బాధ్యతగా వ్యవహరిస్తే జనం మెచ్చే నాయకుడు అవుతాడని, జగం మెచ్చే ఉత్తమడౌతాడని అని ఇరవై సంవత్సరాల క్రితం మా నాయకుడు పవన్‌కళ్యాణ్ పాట రూపంలో చెప్పినది ఇప్పుడు నిజం చేసి చూపించారని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల తెలిపారు. రాష్ట్రం అయినా దేశం అయినా ప్రజలు మీ వెంటే మేము అంటూ మహారాష్ట్ర ఎన్నికలలో ప్రచారం చేసిన అన్నీ స్థానాల్లో విజయం సందర్భంగా ఆదివారం జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కార్యాలయం సుబేదారు పేట సందు పార్టీ మద్దతుదారులు యాసిన్ వారి అనుచరులతో కేక్ కట్ చేసి వేడుక జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అత్యధిక మన్ననలు పొందిన నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఎదుగారని వారి ఆశయాలు జనసేన పార్టీ లక్ష్యాలు ప్రజలకి అవగాహన వచ్చి నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తున్నారని, దేశ స్థాయి నాయకుడిగా పవన్‌కళ్యాణ్‌ని చూడడం సంతోషంగా ఉంది అని తెలిపారు. ప్రజల సమస్యపై పోరాడుతూ వారికి కనీస అవసరాలు అందజేసే పనిలో పవన్ కళ్యాణ్ సఫలీకృతం అవుతున్నారని, మును పెన్నడూ లేని విధంగా గ్రామాల అభివృద్ధి, సహజ వనరుల సంరక్షణ, పొల్యూషన్ కట్టడి జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో అందరి ఆశయాలు, ఆశలు తీర్చే విధంగా పవన్‌కళ్యాణ్ ఎదిగి అందరి మన్నల పొందడం సంతోషంగా ఉందని తెలిపారు. పార్టీలో ఉండి వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయడం మా అదృష్టం అని కూడా తెలిపారు. కార్యక్రమంలో సిటీ కార్యదర్శి హేమచంద్ర యాదవ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, కృష్ణారెడ్డి,యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక వనభోజనాలకు పోటెత్తిన భక్తజనం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** కార్తీకమాసం వచ్చిందంటే.. తెలుగు రాష్ట్రాల్లో వన భోజనాల సందడి ప్రారంభం అవుతుంది అందులో భాగంగా ఈరోజు బుచ్చిరెడ్డిపాలెంలోని కనిగిరి రిజర్వాయర్ వద్దకు సూర్యోదయానికి ముందే బుచ్చి నలుమూలల నుండి ప్రజలు అక్కడికి చేరుకుని ఓ వృక్షం కింద దేవతా విగ్రహాలను ఉంచి సుగంధ పరిమళ పూలదండలతో స్వామివార్లను అలంకరించి వేద పండితుల నడుమ స్వామి వారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు అనంతరం బుచ్చి నలుమూలల నుండి వచ్చిన భక్తులకు వన భోజనం కల్పించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## పట్టాభిని కలిసిన ఎండీఏ అసోసియేషన్ సభ్యులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రెడ్డిని ఆదివారం ఎండీఏ వాహనదారుల అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ని సత్కరించారు. నెల్లూరు జిల్లా నుండి ఎండీయు (పిడిఎస్ డోర్ డెలివరీ వ్యాన్) అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎండీఏలు వాహనదారులు వారి యొక్క సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుదారులకు ఇబ్బంది కలిగించకుండా నిత్యవసరాలు సరుకులు సక్రమంగా డెలివరీ చేయాలని ప్రభుత్వం ఇచ్చినటువంటి రేట్లకే తీసుకోవాలని ఎక్కువ రేట్లు తీసుకోకూడదని అని తెలియజేశారు. అలాగే మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలియచేశారు.

### కూరగాయల వ్యాపారస్తుడ్ని

## బురిడీ కొట్టించిన కేటుగాడు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చి రెడ్డిపాలెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న కూరగాయల దుకాణంలో చోరీ జరిగింది. ఆదివారం కూరగాయలు కావాలంటూ ఇద్దరు వ్యక్తులు దుకాణానికి వచ్చారు. వ్యాపారి శ్రీనివాసులును బురిడీ కొట్టించి గల్లా పెట్టెలోని 20వేల రూపాయల నగదును దోచుకు వెళ్లారు. కాసేపటి తర్వాత గల్లా పెట్టెలోని నగదు కనిపించకపోవడంతో నగదు వ్యాపారస్తుడు శ్రీనివాసులు షాక్ అయ్యాడు. ఈ సందర్భంగా వ్యాపారస్తుడు మాట్లాడుతూ.. కూరగాయలు కావాలంటూ ఇద్దరు వ్యక్తులు వచ్చారని తాను పనిలో పడ్డ సమయంలో గమనించి 20వేల రూపాయలు దొంగతనం చేశారని వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసామన్నారు.

# ఆత్మకూరులో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యవేక్షణలో ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని 19వ వార్డు పరిధిలో తెలుగుదేశం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించగా పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జిల్లా తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సభ్యత్వం స్వీకరించిన వారికి కార్డులు అందజేసిన తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ క్రమం తప్పకుండా సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికల నిర్వహణ నిర్వహిస్తుందని, పార్టీ పటిష్టతకు, కార్యకర్తల సంక్షేమానికి అధినేతలు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటారని పేర్కొన్నారు. తెలుగుదేశం సభ్యత్వం స్వీకరించిన వారు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావడంతోపాటు వారికి ఉచిత భీమా సౌకర్యం కూడా లభిస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, దేవాదాయశాఖా మంత్రి, ఆత్మకూరు అభివృద్ధిప్రదాత ఆనం రామనారాయణరెడ్డి రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికల పట్ల అధికంగా జనం ఆకర్షితులవుతున్నారని, స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం స్వీకరిస్తున్నారని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ గంధళ్ళ వేణు, తెలుగుదేశం నాయకులు ఎస్‌డి అస్లామ్, ఇనయతుల్లా, వల్లెపు వెంకటయ్య, సుబ్బరాయుడు, సుబ్బయ్య, తిరుపాలు, కోటకొండ సుబ్బరాయుడు, వర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కిశోరవికాసం ప్రధానలక్ష్యం : సీడీపీఓ సునీలత






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కిశోరవికాసం లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం రూపొందించిందని, అందులోభాగంగా అందరికీ అవగాహన కల్పిస్తున్నామని ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ పి.సునీలత పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం పమిడిపాడులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.కె.నారాయణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన కిశోరవికాసం అవగాహనా సదస్సులో సీడీపీఓ సునీలత అతిధిగా హాజరై ప్రసంగించారు. బాల్యవివాహాలు చట్టరీత్యానేరమే కాకుండా అనేక ఇబ్బందులు, అసౌకర్యాలు, అనారోగ్యపరిణామాలు ఉంటాయని, ఈ అంశాలను అందరూ గుర్తించి తగిన అవగాహన పొంపొందించుకొని బాల్యవివాహాలు నిరోధించాలని ఆమె సూచించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు దాటిన తరువాత మాత్రమే వివాహాలు చేసుకోవాలని ఆమె సూచించారు. తాత్కాలిక ఆలోచనలతో బాల్యావివాహాలు చేసుకుంటే ఆరోగ్య పరంగా, సామాజిక పరంగా, మానసికంగా ఇబ్బందులు తలెత్తగలవని ఆమె పేర్కొన్నారు. రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి కూడా సిడిపివో సునీలత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.శ్రీదేవి, ఎం.రత్నమ్మ, పలువురు మహిళలు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# 26వ తేదీన దర్నాను జయప్రదం చేయాలి




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కార్మికులకు సంబంధించి వివిద సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 26వ తేదీన నిర్వహించ తలపెట్టిన ధర్నాలో అధికంగా కార్మికులు, సంఘాల నాయకులు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఆత్మకూరులోని డాక్టర్ చెర్లో రమణారెడ్డి భవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో పలువురు నాయకులు పాల్గొ న్నారు. కార్మికులకు సంబందించిన సమస్యల గురించి, అనాదిగా పరిష్కారానికి నోచుకోని విషయం గురించి వారు వివరించారు. ఈనెల 26వ తేదీన స్తానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించ తలపెట్టామని, ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున అందరూ తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండమూరు హజరత్తయ్య, సిఐటియు జిల్లా నాయకులు జి.వి.శివప్రసాద్, జిల్లా కౌలురైతు సంఘ నాయకులు గంటా లక్ష్మిపతి, సిపిఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి పి.రాధ, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు భాస్కర్, సీఐటీయు నాయకులు ఎం.ఓంకార్, మున్సిపల్ కార్మికసంఘ నాయకుడు యు.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులు గృహాలకోసం దరఖాస్తులు చేసుకోవాలి : మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అర్హులైన వారు ఫక్కాగృహం మంజూరుకోసం ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో స్వంత గృహనిర్మాణానికి ఆసక్తిగల అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పిఎంఏవై పథకం ద్వారా నూతన గృహనిర్మాణం కోసం అర్హులు తమ ఆధారాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన డాక్యుమెంట్ల జెరాక్స్ ప్రతులతో ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పిఎంఏవై 2.0 రిజిస్ట్రేషన్‌కోసం రేషన్‌కార్డు, పాన్‌కార్డు, ఆధాయ ధృవీకరణపత్రం, జీవిత భాగస్వామి పేరు, జీవిత భాగస్వామి ఆధార్‌కార్డు, ప్రస్తుత చిరునామా, ప్రతిపాదిత చిరునామా, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత వివరాలు, తల్లి, తండ్రి ఆధార్‌కార్డులు తదితరాలతో ఆన్‌లైన్‌లో గృహ మంజూరుకోసం నమోదు చేసుకోవాలని మంత్రి రామనారాయణరెడ్డి కోరారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరికీ స్వంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ మంజూరు చేయనున్నామని రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

## వైసీపీ నాయుకులు, కార్యకర్తలో ఆత్మీయ సమావేశం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఆదివారం సాయంత్రం వైసీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి నివాసం నందు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అదేవిధంగా కార్యకర్తలకు ఎటువంటి అవసరం వచ్చిన వారి వెంట నేను నడుస్తానని కార్యకర్తలకు నాయకులకు భరోసా కల్పించారు. ఈ ఆత్మీయ సమావేశానికి 26 డివిజన్లో నాయకులు కార్యకర్తలు రావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దేవస్థానంలో శివపార్వతుల వేడుకగా కళ్యాణం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం భక్తులు పొద్దున నుంచి స్వామి అమ్మవార్లను దర్శించుకుని కార్తీకదీపాలు వెలిగించి స్వామివారి తీర్థప్రసాదాలు సేవించినారు.



కార్తీక మాసం సందర్భంగా నెల్లూరు శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానము నందు ఆదివారం శ్రీ మోదెం సత్యనారాయణ గుప్త, పూర్ణిమ వారిచే శివ పార్వతుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణపు దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించినారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. అనంతరం భక్తులందరికీ ఉబయకర్తల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ వేడుకకు సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి జె.శ్రీనివాసరావు, మోదెం సత్యనారాయణ గుప్త, పూర్ణిమ దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్‌చే నలు పేవా కార్యక్రమాలు

**గూడూరు, మేజర్‌న్యూస్ :** లైన్స్ క్లబ్ (వైజేపీ) ఆద్వర్యంలో డిఆర్‌డబ్ల్యు కాలేజ్ నందు నిర్వహించిన కార్యక్రమంలో డిస్టిక్ గవర్నర్ ఎం గౌతం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమాల్లో క్యాబినెట్ సెక్రటరీ జనార్దన్ రావు క్యాబినెట్ ట్రెజరర్ హనుమంతరావులు కూడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో కుట్టు శిక్షణ నేర్పిన మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. వై గురునాథం మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. మురళి నాయుడు స్కూల్ పిల్లలకు బుక్స్ మెటీరియల్ ఇవ్వడం జరిగింది. శీను యాదవ్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేయగా సుబ్రహ్మణ్యం అడవిలో వినాయకుడు గుడికి ఫ్రిజ్ అందించగా వై జె పి క్లబ్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ చిలపూరు శేషమ్మ స్కూలు నందు కుట్టు శిక్షణ ట్రైనింగ్ కొరకు కుట్టు మిషన్ బహుకరించారు. వి చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి పిల్లలకు పౌష్టిక ఆహారం మరియు పిల్లలకు దుస్తులు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ రీజన్ చైర్మన్ ఆర్ వి రావు పసుపులేటి ప్రసాద్ రాజేంద్రప్రసాద్ సాయి ల్యాబ్ అధినేత మురళి పీవీ శివరాం వై వెంకటేశ్వరరావు ఎస్ఎల్ఎన్ స్వామి మురళి రాజు అయ్యావుల రోజా ఆర్ ప్రభావతి ఉమా లక్ష్మీ కుట్టు టీచర్ కావేరి సూళ్లూరుపేట నుండి జోన్ సెక్రెటరీ జానకి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యా స్వరూపనంద స్వామిని దర్శించుకున్న దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి శుఖ బ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా వనభోజనం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విద్యా స్వరూప నందగిరి స్వామి వారి ఆశీస్సులు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు తీసుకున్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడుకు ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడును పలమనేరు కమ్మ సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. పలమనేరులో కమ్మ సంక్షేమ సంఘం సభ్యులు ఆహ్వానం మేరకు ఆయన పలమనేరుకు వెళ్లారు. ఈ సందర్భంగా పలమనేరులో నూతనంగా నిర్మించనున్న కమ్మ సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు 5 లక్షలు రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడుతో పాటు శ్రీకాళహస్తి కమ్మ సంఘం నాయకులు గోగినేని భాస్కర్ నాయుడు, తక్కలపాటి ప్రకాష్ నాయుడు, గోగినేని సురేష్ నాయుడులు పాల్గొనగా వారిని కూడా పలమనేరు కమ్మ సంఘం నాయకులు సన్మానం చేసి మెమెంటోలు అందజేశారు.



## శ్రీనివాసులు మృతదేహానికి కిషన్ చంద్ నివాళి




**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గంగాధర నెల్లూరు తెలుగు యువత అధ్యక్షుడు గురుశాల కిషన్ చంద్ ఆ గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబీకులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు కావలి చక్రి, భాస్కర్, అర్జున్, సుధాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు మెటీరియల్ వితరణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద యువతకు అవసరమయ్యే గ్రూప్ 2, డీఎస్సీ పరీక్షల మెటీరియల్ ను ధాత వితరణ చేశారు. బుచ్చినాయుడు పల్లికి చెందిన ఎంకే నాయుడు మేనల్లుడు డి.వెంకటేశ్వర్ల నాయుడు 6 వేలు రూపాయలు మెటీరియల్స్‌ను అన్నమయ్య కూడలిలోని గ్రేడ్1 గ్రంథాలయ అధికారి శివప్రసాద్ కి ఉచితంగా అందజేశారు. ఈ పుస్తకాలను గ్రంథాలయంలో గ్రూప్ −2, డి.యస్.సి. పోటి పరిక్షలకు సన్నద్ధం అయ్యే నిరుద్యోగ యువతీ యువకులకు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ అధికారులు కోరారు. గ్రంథాలయాధికారి జె.శివ ప్రసాద్ గ్రూప్ −2, డి.యస్.సి మెటీరియల్ గ్రంథాలయానికి వితరణ చేసిన డి.వెంకటేశ్వర్లు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయాభివృద్ధికి దాతలు సహకారం అందించాలని కోరారు.



# కులగణ రిజర్వేషన్ల పెంపుకై బీసీల ర్యాలీ : నాగరాజు గౌడ్

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** సమగ్ర జనగణనతో పాటు కులగణన చేపట్టి కూటమి ప్రభుత్వం హామీ మేరకు బీసీలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ కు బీసీల భారీ ర్యాలీగా బయలుదేరి వెళుతున్నట్లు తెలియజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే ఈ ర్యాలీ డీబీఆర్ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వసి నివాళులర్పించి తిరుచానూరు హైవే నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అనంతరం జిల్లా కలెక్టరు కు వినతిని అందజేస్తామని తెలిపారు. 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అణగారిన వర్గాలకు, వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన కులాల వారీగా వివరాలను శాస్త్రీయంగా సేకరించకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సమగ్ర జణగణన చేపట్టి వారి సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేసేందుకు వెనుకంజవేయడం విడ్డూరమన్నారు. ఈ డిమాండ్ చేపట్టే భారీ ర్యాలీకి బీసీ సంఘ నేతలు, బీసీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్, నాయకులు మధు ఆచారి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.




# డిగ్రీ కళాశాల పేరు మార్పు జరిగేనా...?

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** వెదురుకుప్పం వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరు మార్పు జరిగేనా.. అని పలువురు చర్చించుకుంటున్నారు. వెదురుకుప్పం వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గత వైసిపి ప్రభుత్వం మంజూరు చేసింది. కళాశాల భవన నిర్మాణానికి సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని పచ్చికాపలం సమీపంలో ఏర్పాటు చేశారు. కళాశాలకు ఏర్పాటు చేసిన స్థలంలో దివంగిత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కానీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో



డిగ్రీ కళాశాలను చవట గుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షిఫ్ట్ పద్ధతుల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలుతో మార్పులు జరిగి కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు కొనసాగుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలభవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో గంగాధర నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికైన డాక్టర్ వి ఎం థామస్ విద్యార్థుల అవస్థలను గుర్తించి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కళాశాల భవన నిర్మాణానికి సుమారు 18 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారు. దీంతో విద్యార్థులు మరియు మండల ప్రజలు ఎమ్మెల్యేకు అభినందన తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగాఎన్టీఆర్ పేరుతో ఉన్న పలు పథకాలను, కళాశాలలకు పెట్టిన పేర్లను తొలగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో వెదురుకుప్పం వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరు మార్పు జరుగుతుందా అని పలువురు చర్చించుకోవడం కొస మెరుపు. దీనిపై రాజకీయ పరిణామాలు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాల్సిందే.

## షాద్రి గ్రీన్ సిటీలోని విద్యుత్ శాఖ అవినీతి!




**కోట, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆర్ఎంబి రోడ్డు పక్కన ఉన్న పోరంబోకు స్థలంలో ఉన్నటువంటి విద్యుత్ కి సంబంధించిన ఒక ట్రాన్స్ఫార్మర్‌ను శేషాద్రి గ్రీన్ సిటీ లేఔట్ లోనికి మార్చడం జరిగింది. ఆ మార్చిన దానిలో పలు అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మార్చిన ట్రాన్స్ఫారం దగ్గర నుండి వారు ఏర్పాటు చేసుకున్నటువంటి ట్రాన్స్ఫారం వరకు ఎల్ టి లైన్ ఎందుకు రన్ చేయాల్సిన అవసరం ఏముంది అంటే భవిష్యత్తులో ఆ ట్రాన్స్ఫారం నుండి ఈ ట్రాన్స్ఫారంకు కరెంట్ వాడుకొనుటకు పైన హెచ్టి ఎల్టి లైన్‌ను ఒకే స్తంభం మీద ఎందుకు ఏర్పాటు చేయవలసి వచ్చింది దీనివల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరుగుటకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అదే శేషాద్రి గ్రీన్ సిటీ వాళ్లకి టర్న్ కి ఎస్టిమేట్ వేసి ఉన్నారు ఆ యొక్క ఎస్టిమేషన్ లోనే లేదు సపరేట్ సపరేట్గా వేసి ఉండొచ్చు కదా. పైన తెలిపినటువంటి లేఔట్ లోని విద్యుత్ వర్కులో పలు అవకతోకలు ఉన్నట్లు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులకు ఈ లేఔట్ లో ఎంత మొత్తము లబ్ధి చేకూరినదో. తెలిపినటువంటి ట్రాన్స్ఫారం మార్చి నా కాంట్రాక్టర్ ఎవరు డిపార్ట్మెంట్ కి సంబంధించిన వ్యక్తి. అసలు శేషాద్రి గ్రీన్ సిటీ లేఔట్ కు ఎస్టిమేషన్ పర్మిషన్ ఉందా లేదా ...?

## ఆర్టీసీ బస్సులో యువకుడు ఆత్మహత్య

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో యువకుడు ఆత్మహత్య. శ్రీకాళహస్తి తిరుపతి మార్గంలో రేణిగుంట సమీపంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి నుండి తిరుపతి వెళ్లే బస్సులో మేర్లపాక స్టేజి వద్ద బస్సు ఎక్కిన యువకుడు బస్సులో ఈ ఘటనకు పాల్పడ్డాడు. బస్సులో డ్రైవర్ కండక్టర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు ఉండడంతో ఆర్టీసీ సర్వీసులో వెనకవైపు కు వెళ్లి తన వెంట ఉన్న దారంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బస్సు ఉదయం సరిగా రేణిగుంట చేరుకోవడంతో గ్రహించిన బస్సు సిబ్బంది రేణిగుంట పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



## నారా రామ్మూర్తి నాయుడుకి నివాళులు



**ఎస్ఆర్‌పురం, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టిడిపి జిల్లా సీనియర్ నాయకులు బోడపాటి లోకనాథ్ నాయుడు రాష్ట్ర టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు నివాళులర్పించారు ఆదివారం నారావారిపల్లె లో నారా రామ్మూర్తి నాయుడు ఇంటి వద్దకు వెళ్లి నారా రామ్మూర్తి నాయుడు సతీమణి నారాఇందిరా, కుమారులు నారా గిరీష్, హీరో నారా రోహిత్ కుటుంబ సభ్యులను ఓదార్చారు అనంతరం బోడపాటి లోకనాథ నాయుడు మాట్లాడుతూ నారా రామ్మూర్తి నాయుడు చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి నాకు మంచి మిత్రుడు ఆయనతో తెలుగుదేశం పార్టీ సేవా కార్యక్రమాల్లో కలిసి మెలిసి పనిచేశాం అని బోడపాటి లోకనాథ నాయుడు తెలిపారు ఈ కార్యక్రమంలో బెంగళూరు కమ్మ సంఘ అధ్యక్షుడు రాజగోపాల్ నాయుడు, జయ చంద్ర నాయుడు పాలసముద్రం రవి నాయుడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరిణిలో పారిశుద్ధ్యని తొలగించరా!

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ స్వామివారి పుష్కరిణి తిరుమల తిరుపతి దేవస్థానం స్వాధీనంలో పుష్కరిణిచుట్టూ పిచ్చి మొక్కలు ముళ్ళ కంప పెరిగిపోయి పుష్కరిణి చుట్టూ పాదాచార్యులు తిరగాలంటే ఇబ్బంది పడుతున్నారు, అదే విధంగా పుష్కరింద చెత్తా, తాగునీటి బాటల్లో ఎక్కువగా ఉంది, పుష్కరిణిలో అయ్యప్ప స్వామి భక్తులు ప్రతిరోజు స్నానవాచరించేవారు. దీనివల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా దేవస్థాన అధికారులు స్పందించి పుష్కరిని చుట్టూ ఉండే కంపను, పారిశుద్ధ్యని తొలగించాలని అయ్యప్ప స్వామి భక్తులు కోరుతున్నారు.



# పార్కు పనులేమాయె.. కేటాయించిన నిదులేమాయె..

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఆరుపార్కులకు నిధులు కేటాయిస్తున్నామని, పనులు ప్రారంభిస్తామని చెప్పిచెప్పిన పాలకులు, అధికారులు ఆ పార్కుల పనిచేయకపోగా కేటాయించిన నిధులేమయ్యాయో అని పలువురు పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఆత్మకూరు-బట్టేపాడు మార్గంలో దాదాపు కోటిరూపాయలతో పార్కు ఏర్పాటు చేస్తామంటూ గతంలో అక్కడున్న స్థలానికి చుట్టూరా ప్రహరీ నిర్మించారు. అనంతరం ఏమాత్రం పనులు జరుగకపోగా నాశిరకంగా నిర్మించిన ప్రహరీగోడకూడా పడిపోసాగింది. ఆస్థలం నిరుపయోగంగా ఉంది. కాగా ఆత్మకూరు మున్సిపల్ బస్టాండు సమీపంలో 2015లో పార్కు నిర్మిస్తామంటూ అధికారులు, పాలకులు హడావిడి చేశారు. ఈనాటికీ ఆ స్థలం పార్కుకు నోచుకొనకుండా నిర్మానుష్యంగా దర్శనమిస్తుండగా జనాలు బహిర్భూమిగా వినియోగించుకుంటున్నారు. 2015లో ఆత్మకూరు పురపాలక సంఘానికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 10.5కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, ఎస్సీ, ఎస్టీ నివాసప్రాంతాల్లో సిమెంటురోడ్లు నిర్మించారు. అందులోభాగంగా శ్మశానవాటికలు, డిజిటల్ లైబ్రరీలుకు కూడా కొంతమేరకు నిధులు కేటాయించగా కొంతమేరకు పనులు కూడా జరిగాయి. బస్టాండు సమీపంలోని 12, 13వ వార్డులకు సంబంధించి అక్కడ ఒక ఎకరా స్థలం పార్కుకు ఉద్దేశించబడి ఉంటుండేది. ఇక్కడ పార్కుగా ఏర్పాటు చేయాలని గతంలో పంచాయతీ పాలకులు, అధికారులకు, మున్సిపాలిటీ అయ్యాక పాలకులు, అధికారులకు ఆప్రాంత వాసులు వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. 2015లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 98 లక్షల రూపాయలను పార్కు ఏర్పాటుకు కేటాయిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. కాగా పార్కు పనులు చేపట్టనేలేదు. మరి ఆ నిధులేమయ్యాయో.. ఎలా దారిమళ్ళించారో అని పలువురు నాటినుండి ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్ళతరువాత మళ్ళీ ఆప్రాంత యువత ఈ విషయాలన్నింటిని అధికారుల వద్ద ఏకరువుపెట్టి పార్కు పనులు చేపట్టాలని కోరసాగారు. మున్సిపాలకులు, అధికారులు, ఎమ్మెల్యేలు తదితరులందరికీ వినతి పత్రాలు ఇచ్చారు. ఈపార్కు నిర్మాణానికి 16లక్షల రూపాయలు కేటాయిస్తూ మున్సిపల్ తీర్మానం చేశారు. పనులు ప్రారంభిస్తారని ఆప్రాంత వాసులు ఆశపడ్డారు. కానీ పనులు చేపట్టకపోగా ఆ నిధులు ఏమయ్యాయో అని ప్రశ్నిస్తున్నారు. పార్కుకు ప్రతిపాదించబడిన స్థలం మాత్రం వ్యర్థాలతో నిండుకొని జనాలు బహిర్భూమిగా వాడుకుంటూ కన్పిస్తోంది. ఆత్మకూరును గతంలో అనూహ్యంగా అభివృద్ధిచేసిన ఆనం రామనారాయణరెడ్డి ఈదపా ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ దపాకూడా ఆత్మకూరును అనూహ్యంగా అభివృద్ధి చేయాలని



బోలెడుప్రణాళికలతో ముందుకెళుతున్నారు. ఆయన ఈ పార్కు విషయమై పరిశీలించి దృష్టి సారించి పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని 12, 13వ వార్డుల ప్రజలు కోరుతున్నారు. అదిగో పార్కు, ఇదిగో నిధులు అంటూ దశాబ్దాలతరబడి పాలకులు, అధికారులు ఇక్కడి జనాలను మభ్యపెడుతు న్నారని, ఇప్పటికైనా పార్కు ఏర్పాటుకు కార్యాచరణకు పూనుకోవాలని వారంతా కోరుతున్నారు.

### పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళ

# తక్షణమే స్పందించిన 108 అంబులెన్స్ సిబ్బంది



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని మొలకలపూండ్ల గ్రామానికి చెందిన ఎస్టీ మహిళ పి.నందిని అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో ఆశా వర్కర్ అందుబాటులో లేకపోవడంతో స్థానికులు ఆపదలో ఉన్న వారిని ఓ సంజీవినిలా కాపాడే 108కి ఫోన్ చేయగా తక్షణమే స్పందించిన 108 వాహన సిబ్బంది సకాలంలో చేరుకొని పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళలను సైదాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే తరలించే క్రమంలో మార్గం మధ్యలోనే నొప్పులు ఎక్కువ రావడంతో అంబులెన్స్‌ను ఆపి చాకచక్యంగా పురుడు పోశారు. ఈ క్రమంలో పి.నందిని ఓ ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ లోని టెక్నీషియన్ ఎం.అశోక్ కుమార్, పైలట్ బివి రమణయ్య తెలిపారు. సైదాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేయడం జరిగిందని తెలిపారు. అయితే స్థానికులు 108 సిబ్బంది గవర్నమెంట్‌కు స్ట్రైక్ నోటీస్ ఇచ్చినప్పటికీ మండలాల పరిధిలో నిరసనలు తెలియజేస్తూ సకాలంలో విధులు నిర్వహిస్తున్నారని అంబులెన్స్ సిబ్బంది పట్ల బేస్ అంటున్న మండల ప్రజలు తమ మనసులోని మాటలు తెలియజేశారు.

# కార్యకర్తల అభినందన సభకు సభా వేదిక స్థల పరిశీలన

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ స్థాయి కార్యకర్తల అభినందన సభ జరిపేందుకు నాయకులు సమాయత్తమవుతున్నారు. ఎన్నికలు జరిగి నాలుగు నెలల గడుస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 3వ తేదీన అభినందన సభ జరిపేందుకు నిర్ణయించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అందుబాటులో ఉన్న వింజమూరులోని ఎస్‌వీఎస్ కళ్యాణ మండపం, పక్కనే ఉన్న స్థలాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరు నుండి వచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి టీం కలిసి ఆదివారం స్థల పరిశీలన చేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సభలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా నేతలు ఉదయగిరి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, పొలిటికల్ మేనేజర్



మాలేపాటి చైతన్య, మాజీ సొసైటీ అధ్యక్షులు జూపల్లి రాజారావు సీనియర్ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి వనిపెంట సుబ్బారెడ్డి మాజీ ఎంపీటీసీ సభ్యులు గురజాల వెంకటరమణయ్య, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, చేజర్ల భాస్కర్‌రెడ్డి, పాములపాటి మాల్యాద్రి, పార్టీ కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

# పంచాయతీ కుళాయిలో మరుగు నీరు

● పట్టించుకోని అధికారులు..



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని మల్లిదేవి కాలువ వద్ద ఉన్న వెంకటకృష్ణ నగర్‌లో పంచాయతీ కులాయిలలో మురికి నీరు వస్తుందని స్థానికులు వాపోయారు. గత రెండు నెలల నుంచి ఇదే దుస్థితి కొనసాగుతుందని తెలిపారు. మురికి నీరు వస్తే తాగడానికి, స్నానం చేయడానికి నిరుపయోగంగా మారిందన్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని చెప్పారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు

# కలగకుండా తగు జాగ్రత్తలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండ పై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు కార్తీకమాసం సందర్బంగా ఆదివారం ఉద్యానవనం ఎదురుగ ఉన్న ఖాళి ప్రదేశం, ఏడు కోనేర్ల వద్ద వివిధరకాల కులసంఘాల వారి వనబోజనం, శ్రీకృష్ణ చరిత మానస భక్త మండలి నెల్లూరు వారి ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం కార్యక్రమాలు అత్యంత వైబవంగా జరిగాయి. ఈ సందర్బంగా స్వామి వారిని అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు అదేవిధంగా భక్తులకు దేవస్థాన అన్నదానం ద్వార అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్న, మెరుగైన సౌకర్యాలను ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఏర్పాట్లు చేసారు.

# 32వ డివిజన్ వైసీపీ నాయకున్ని ఆనం పరామర్శ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 32వ డివిజన్ చెందిన వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ జావిద్ ఇటీవల ప్రమాద బారినపడి, కాలికి గాయమై, శస్త్ర చికిత్స చేయుంచుకున్న విషయాన్ని తెలుసుకున్న నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి జావిద్ ఇంటికి వెళ్లి, పరామర్శించారు. అనంతరం వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎల్లవేళలా మద్దతునిచ్చే జావిద్ త్వరగా కోలుకోవాలని ఆనం విజయకుమార్ రెడ్డి ఆకాంక్షించారు. జావిద్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.